క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



లక్ష్మీపురం: మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ''తల్లికి వందనం'' సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతి పత్రం అందేశారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం మున్సిపల్ కార్మికులకు ఎవరికి అమలు చేయటం లేదన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పెరిగిన ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు, నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ నగర అధ్యక్షుడు పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు కుంభా శివయ్య, ఎస్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, పవన్ కుమార్, ఆర్ముగం, బాలప్రసాదరావు ఉన్నారు.

ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి

లక్ష్మీపురం: నగరంలోని శారదా కాలనీ ప్రాంత ప్రజల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని భారత కమ్యూనిస్టుపార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శారదా కాలనీ ప్రాంత ప్రజలు సుబ్బయ్య, ఈశ్వరరావు, వెంకటేశ్వర్లు, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, అరుణ్ కుమార్, శశి, సమితి సభ్యులు ఇరిగినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం సైమన్ బదిలీ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ ఏడీఆర్ఎం కె.సైమన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏడీఆర్ఎంగా రమేష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎం.రమేష్ కుమార్ నేషనల్ హై స్పీడ్ రైల్ కారిడార్ లిమిటెడ్(ట్రాక్), సూరత్‌లో చీఫ్ ప్రాజెక్టుల మేనేజర్‌గా పని చేశారు. సికింద్రాబాద్‌లో డెప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్(ఇంజినీరింగ్)గా బాధ్యతలు నిర్వర్తించి ఇటీవల బదిలీల్లో గుంటూరు రైల్వే డివిజన్ ఏడీఆర్ఎంగా వచ్చారు. గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం కార్యాలయంలో ఏడీఆర్ఎం సైమన్ బదిలీ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో డీఆర్ఎం సుధేష్ట సేన్ పాల్గొన్నారు.

ప్రతి నెల ఒక పుస్తకం పరిచయం చేయాలి



నగరంపాలెం: స్థానిక కొరిటిపాడు సాకేతపురం వీధిలోని గుంటూరు జిల్లా రచయితల సంఘ సభ్యులు దారివేముల అనిల్‌కుమార్ నివాసంలో సోమవారం కవిత్వంతో కాసేపు నిర్వహించారు. సంగీత సాహిత్య ప్రముఖులు భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవిత్వమనగా రాయడంతోపాటు చదవడం తెలిసి ఉండాలని అన్నారు. కవిత్వం రాసేటప్పుడు చేసే పద ప్రయోగం సందర్భోచితంగా ఉండాలని పేర్కొన్నారు. ఏ పదం ఏ సందర్భంలో వాడాలనేది కవి ఒకటికి రెండుసార్లు సమీక్షించుకోవాలని చెప్పారు. అర్థం, భావం మారకుండా కొత్త పదాలు రాయాలని వివరించారు. ప్రతినెలా కవిత్వంతో పాటు ఒక పుస్తకాన్ని పరిచయం చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం కవులు తమ స్వీయ కవితలతో పాటు ఇతర కవుల కవితలను చదివారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, ఎం.సుభాద్రాకృష్ణ, సంబరాజు రమణి, తాటికోల పద్మావతి, ఎం.లలితకుమారి, షేక్.మస్తాన్‌బాబు, మెట్టు శ్రీనివాసరెడ్డి, సి.సురేష్, పి.బలరాం, బండికల్లు జమదగ్ని, నానా, శ్రీ వశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

వృద్ధులపై దాడులు నియంత్రించాలి

తెనాలి: వృద్ధులపై దాడులను అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు ఖండించాలని, అలాంటి దాడులపై పోలీస్ యంత్రాంగం వెంటనే స్పందించాలని కోరుతూ తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ వి.సంజనా సింహాకు వినతిపత్రం సమర్పించారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గృహహింసపై ఏవిధంగా అయితే స్త్రీలకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ ఉన్నదో.. అలాగే కుటుంబాల్లో వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు ప్రవర్తిస్తున్న తీరును పరిగణన లోకి తీసుకొని వృద్ధులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. వృద్ధుల ఆస్తి, ప్రాణ రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అద్దెలపై జీవనం సాగిస్తున్న వృద్ధులపై అద్దెకు ఉంటున్నవారి దాడులపైనా స్పందించాలన్నారు.

తాగునీటి సమస్యకు చెక్

- నెహ్రూనగర్ వాటర్ ట్యాంకు నుంచి హెచ్‌ఎల్‌ఆర్‌కు కనెక్షన్
- 900 ఎంఎం డయా పైపు లైను ఏర్పాటు
- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు
- ఎన్నికల కోడ్ దృష్ట్యా ఆగిపోయిన పనులు
- పనులు కొనసాగిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు



నెహ్రూనగర్ 10వ లైను వద్ద కొనసాగుతున్న పైపులైన్ పనులు

నెహ్రూనగర్: నగరానికి తాగునీటి సమస్యలు తీరనున్నాయి.. ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గానికి లబ్ధిచేకూరనుంది. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్ వాటర్ ట్యాంకులకు(పశ్చిమ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేసే ట్యాంకులు) తాగునీటిని సరఫరా చేసే 800 ఎంఎం డయా పైపులైనుపై తరుచూ లీకులు ఏర్పడి హెచ్‌ఎల్‌ఆర్ వాటర్ ట్యాంకులకు అందాల్సిన నీరు సక్రమంగా అందడం లేదు. పశ్చిమ టెయిల్ ఎండ్ పాయింట్‌లో ఉండే కొన్ని వేల మంది ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. నగరంలో ఉత్పన్నమవుతున్న తాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు గత ప్రభుత్వం నడుం బిగించింది. 800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 డయా పైపులైన్ వేశారు. సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ వద్ద కొన్ని ఇబ్బందులు రావడం.. ఈ లోపు సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో సుమారు 90 మీటర్లు మేర కొత్త పైపులైన్ వేసే(రైల్వే ట్రాక్ కింద నుంచి నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల వరకు) పనులు ఆగిపోయాయి.

గత ప్రభుత్వ హయాంలోనే..

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్‌కు గతంలో 800 ఎంఎం డయా పైపులైను మీద తాగునీటి సరఫరా జరిగేది. అయితే ఈ పైపులైను పురాతన పైపులైను కావడంతో తరుచూ లీకులు ఏర్పడుతూ ఉండేవి... ఇంజినీరింగ్ అధికారులు ప్రతి సారి కొన్ని లక్షలు ఖర్చు పెట్టి లీకులకు మరమ్మతులు చేయడం... పంపింగ్ జరిగే సమయంలో ఒత్తిడి పెరిగి మరమ్మతులు చేసిన లీకులు తిరిగి లీకులు పడుతూ వస్తూ ఉండేవి. దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు గాను గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఉన్న 800 ఎంఎం డయా పైపులైన్ కాకుండా వేరే ప్రాంతాల మీదుగా 900 ఎంఎం డయా పైపులైన్(సంజీవయ్యనగర్, వసంతరాయపురం ట్యాంకులు, జానీకాలనీ, శ్రీ హాస్పిటల్, డొంకరోడ్డు మెయిన్‌రోడ్డు మీదుగా అమరావతి రోడ్డు క్రాస్ చేసుకుంటూ హెచ్‌ఎల్‌ఆర్‌కు) వేశారు. ఈ పైపులైను వర్కింగ్‌లోకి తీసుకువచ్చి లీకులను అరికట్టేందుకు ఇంజినీరింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. సంజీవయ్యనగర్ రైల్వే గేటు దాటిన తరువాత 800 డయా పైపులైన్ నుంచి 900 డయా పైపులైన్‌కు గత రెండేళ్ల క్రితం ఇంటర్ కనెక్షన్ చేశారు. ప్రస్తుతం దీని మీద పశ్చిమ నియోజకవర్గానికి వాటర్ పంపింగ్ జరుగుతోంది.

వాటర్ సరఫరా ఇలా...

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్‌ఎల్‌ఆర్ వాటర్ ట్యాంకులకు ప్రతి రోజు 50 నుంచి 60 ఎంఎల్‌డీ(మిలియన్స్ ఆఫ్ లీటర్ ఫర్ డే) సరఫరా అవుతూ ఉండేది. ఈ లీకుల వలన ప్రతి రోజు 10 ఎంఎల్‌డీ వాటర్ వృథాగా పోయేవి. దీంతో హెచ్‌ఎల్‌ఆర్ వాటర్ ట్యాంకుల పరిధిలో టెయిల్ ఎండ్ పాయింట్(వాటర్ ట్యాంకులకు దూరంగా ఉండే ప్రాంతాలు) గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, స్వర్ణాంధ్రనగర్, బుడ జంగాల కాలనీ, జన్మభూమి నగర్, వికాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో నివాసముండే సుమారు 30 వేల మందికి తాగునీటి సమస్య వస్తుండేది. ఈ పైపులైన్ వేయడం ద్వారా తాగునీటి సమస్యకు చెక్ పెట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి

హెచ్‌ఎల్‌ఆర్ నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు వరకు 900 ఎంఎం డయా పైపులైన్ వేశారు. రైల్వే ట్రాక్ కింద నుంచి నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల వరకు సుమారు 90 మీటర్లు పెండింగ్ ఉండటంతో దానిని ఇప్పుడు పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పనులు పూర్తయితే పశ్చిమ నియోజకవర్గానికి నీటి కష్టాలు పూర్తిగా పోతాయి.

> **వారం రోజుల్లో పూర్తి చేయిస్తాం**
>
> సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ కింద నుంచి నెహ్రూనగర్ 10వ లైను మెయిన్‌రోడ్డు వరకు 900 ఎంఎం డయా పైపులైన్ నూతనంగా వేస్తున్నాం. వారం రోజుల్లో పైపులైన్ పనులు పూర్తి చేసి కొత్త పైపులైన్ మీద పశ్చిమ నియోజకవర్గానికి వాటర్ పంపింగ్ చేస్తాం.
>
> – సుందర్రామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

విద్య ద్వారానే సమాజాభివృద్ధి

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి



ఉపాధ్యాయులతో బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం సర్వతోముఖాభివృద్ధికి విద్యే సాధనమని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి పేర్కొన్నారు. నగరంపాలెంలోని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి బాలుర వైశ్య హాస్టల్‌లో వట్టిచెరుకూరు మండలం గారపాడులో తమ తండ్రి పేరున నడుస్తున్న బొమ్మిడాల కోటి రత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేసి బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు గాదే వీర భాస్కర వెంకటరావు, ఉపాధ్యాయులు రావెల బుర్రయ్య(తెలుగు), స్వామి వెంకట లక్ష్మీ ప్రశాంతి(హిందీ), మర్రెడ్డి బసవ రాజేశ్వరి(ఆంగ్లం), మునునూరు శ్రీలత(గణిత)లను అభినందన సత్కారం శ్రీ కృష్ణమూర్తి, లక్ష్మీ అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా చేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మానం సుభాష్ చంద్రబోస్ రెడ్డి, ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మలినేని హనుమంతరావు, మాజీ సర్పంచి గుంటి వీరయ్య, తీయగూర కృష్ణారెడ్డి, బోనం శ్యామ్ సుందర్ రెడ్డి, మోదుగుల రవికృష్ణ, ప్రొఫెసర్ వి.సింగారావు, ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారానికి కృషి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 27 ఫిర్యాదులు తీసుకుని అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని చెప్పారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌లో కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామని వివరించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సిబ్బందిని కేటాయించి, ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 17, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 2, ఉపా సెల్ విభాగానికి 3, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు మొత్తం 44 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సీపీ రాంబాబు, వీఏఎస్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఈఈలు సుందర్రామి రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, షేక్ నూరిఫాతిమా



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో సోమవారం నాలుగో డివిజన్ నేతలతో సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు భరోసా కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు.

వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

లక్ష్మీపురం: వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పలు సంఘాల నాయకులతో ఏర్పడిన వక్ఫ్ పరిరక్షణ వేదిక నేతలు గుంటూరు నగరంలోని పెద్ద మసీదు, అంజుమన్ ఏ ఇస్లామియా ధార్మిక సంస్థలకు చెందిన కొత్త మల్లాయపాలెంలోని 233 ఎకరాలు, చిన్న కాకానిలోని 78 ఎకరాల వక్ఫ్ భూమిని, భూసేకరణ చట్టం- 2018 యాక్ట్ 22 ప్రకారం సేకరించి ఏపీఐఐసీ ద్వారా ఐటీ పార్కులకు కేటాయించడం వక్ఫ్ చట్టాన్ని అపహాస్యపాలు చేయటమేనని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ సదరు ప్రతిపాదనలను తొలుత వక్ఫ్ సంస్థ వారికి పంపి వక్ఫ్ సంస్థ తీసుకునే నిర్ణయాలపై ప్రభుత్వం తదుపరి నిర్ణయం ఉంటుందని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్.ఎం.చిష్టి, మహమ్మద్ కలీమ్, షేక్ ఖాజావలి, షేక్ భాషా, షేక్ బాజీ, ఖాన్, జబ్బర్ ఉన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, జేవీవీ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్న జనవిజ్ఞాన వేదికలో ప్రజలు భాగస్వాములు కావాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞానవేదిక అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యావంతులే అనేక మూఢ నమ్మకాల వలలో చిక్కుకుంటున్నారని, శాస్త్రీయ భావజాలాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని వివరించారు. విద్యాసంస్థల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు, జి.వెంకట్రావు, ఎస్ఎం సుభానీ, యశ్వంత్, మనీష, గురుబ్రహ్మం, ఎం.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి



యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

నెహ్రూనగర్: ప్రజలు తమ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గాంధీ పార్క్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థలో చారిత్రాత్మకమైన గాంధీ పార్క్‌లో యోగా కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలకు యోగాపై అవగాహన కలిగించడం కోసం వార్డు సచివాలయాల వారీగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటికే సుమారు 8 లక్షల మందికి పైగా యోగాంధ్రలో తమ వివరాలు నమోదు చేసుకున్నారని, జూన్ 21న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే భారీ యోగాకి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ యోగాతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు సమాజంపై స్పృహని కూడా కలిగిస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నగరపాలక సంస్థ యోగా సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ సజీల, ఎల్ఐడీసీ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా టూరిజం శాఖాధికారి శ్రీరమ్య, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, యోగా గురువు సాంబశివరావు పాల్గొన్నారు.

షాదీఖానాల నిర్మాణాన్ని పూర్తిచేయాలి

ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ సమావేశం వినతి

తెనాలి: నియోజకవర్గంలో 2018లో నిర్మాణం ఆరంభించి వివిధ దశల్లో ఆగిపోయిన షాదీఖానాల పనులను పూర్తిచేసి ముస్లిం సమాజానికి ఉపయోగపడేలా చూడాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ (ఎంయూఎఫ్) ముఖ్య కార్యకర్తల సమావేశం కోరింది. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తిచేసింది. స్థానిక చినరావూరు తోటలో మైనారిటీ నేత షేక్ ఖలీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ కలీమ్ ఆదేశాల ప్రకారం తెనాలి పట్టణ, తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలాల అడ్‌హాక్ కమిటీలను నియమించారు. రానున్న నాలుగు నెలల్లో అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఎంయూఎఫ్ బలోపేతానికి విస్తృత స్థాయిలో సభ జరపాలని తీర్మానించారు. పట్టణ అడహాక్ కమిటీలో షేక్ దావూద్ తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా చల్లా ఓబులేసు

నెహ్రూనగర్: కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసుకు బాధ్యతలు కేటాయించారు. ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లకు విధులు కేటాయిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో భాగంగా గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వైజాగ్ వెళ్తున్నారు. అప్పటి వరకు అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించనున్నారు. 23వ తేదీన తిరిగి కమిషనర్ విధుల్లో చేరనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని గుంటూరు టౌన్-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించడం, విద్యుత్ లైన్‌ల మెయిటెన్స్ తదితర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బ్రాడీపేట 1/14 నుంచి 4/18 లైనుల ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల సమస్యలపై వినతి

లక్ష్మీపురం: విద్యా రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్ మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన కోడిగుడ్ల సత్రం హాస్టల్ ను ప్రారంభించాలని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో ఫ్రీ సీట్ వచ్చిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వటం లేదన్నారు. అలాంటి స్కూల్స్ గుర్తింపును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు షంషీర్, సుభాని పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల శాంతి కల్యాణం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీవిఘ్నేశ్వరస్వామి సహిత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. గోపూజ, మండపారాధన, అయ్యప్ప స్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, శివకుమార్‌శర్మ, శ్యామ్ బృందం పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం హోమం మహాపూర్ణాహుతి, మెట్ల పూజ, శివపార్వతుల కల్యాణం వైభవంగా కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం కల్యాణమూర్తులతో శోభాయాత్ర అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఏంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతులు, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

మహాభారతంపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం మహాభారతంలోని అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ ప్రవచిస్తూ మానవ ధర్మాలలో దైవ, పితృ, రుషి రుణాలను ధర్మంగా భావించి, ఆచరించాలని అన్నారు. రామాయణంలో శ్రీరామచంద్రుడు తండ్రి మాటను ధర్మంగా భావించి వనవాసానికి వెళ్లాడని వివరించారు.

వాహన చోదకుల అవస్థలు



గడ్డర్ వద్ద ఏర్పాటుచేసిన స్పీడ్‌బ్రేకర్లు



కృష్ణాశ్రమం వైపు వెనుదిరిగి వెళ్తున్న చోదకులు

నగరంపాలెం: స్థానిక కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి అండర్‌గ్రౌండ్ వద్ద రాకపోకలు సాగించే వాహన చోదకులు సోమవారం ఇబ్బందులకు గురయ్యారు. అందుకు జీఎంసీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని వాపోయారు. ఏటీ అగ్రహారం, కలెక్టరేట్ వైపు, టీజేపీఎస్ కళాశాల, బ్రాడీపేట వైపు వెళ్లే పాయింట్ల వద్ద ఇటీవల గడ్డర్లు ఏర్పాటు చేశారు. అయితే వాటితోపాటు సోమవారం స్పీడ్ బ్రేకర్‌లను ఒకట్రెండు చోట్ల కార్మికులతో పనులు చేయించారు. దీంతో అటు, ఇటు వచ్చే పోయే వాహనచోదకులు ఎడమ, కుడి వైపు అనే తేడా లేకుండా ఒక వైపే రాకపోకలు చేశారు. తద్వారా ఉదయం, మధ్యాహ్న వేళల్లో కార్యాలయాలు, స్కూల్స్, ఇళ్లకు వెళ్లేందుకు పది నిమిషాలకు పైగా గడిచింది. దీంతో చోదకులు అసహనం వ్యక్తం చేశారు.